హైదరాబాద్ వార్త



# ఎయిర్‌పోర్టు మెట్రో పనులు స్పీడప్..!

**హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త**

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు ఎక్స్‌ప్రెస్ మెట్రోకు సంబంధించిన డిపో విమానాశ్రయంలోనే రాబోతోంది. డిపో ఏర్పాటు చేసేప్రాంతాన్ని అధికారులు ఇప్పటికే గుర్తించారు. సుమారు 30 ఎకరాలను డిపో కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ తీసుకోనుంది. ఈ ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంలో విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ భాగస్వామ్యం ఉన్న సంగతి తెలిసిందే. మొత్తంగా విమానాశ్రయ ప్రాంగణంలో 2 స్టేషన్లు ఒక డిపో రాబోతున్నాయి. మెట్రో రైలు తొలిదశలో ఉప్పల్‌లో 100 ఎకరాల్లో, మియాపూర్‌లో 100 ఎకరాల్లో డిపోలను నిర్మించారు. వాస్తవంగా డిపో 30 ఎకరాలలోపే ఉంటుంది. మిగతా 70 ఎకరాలను రవాణా ఆధారిత అభివృద్ధి(టివోడి)కి కేటాయించారు. విమానాశ్రయ మెట్రోలో కేవలం డిపో అవసరాల కోసమే కాబట్టి 30 ఎకరాలు సరిపోతుందని మెట్రో అధికారులు అంటున్నారు. ఎయిర్ పోర్టు మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే తదితర పనులు ప్రాథమిక పనులన్నీ పూర్తయ్యాయి. భూసామర్థ్య పరీక్షల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎయిర్ పోర్టు మెట్రో కోసం చేపట్టిన కొత్త సర్వే ప్రకారం రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుండి ఎయిర్‌పోర్టు టెర్మినల్ స్టేషన్‌ల నడుమ మొత్తం దూరం 31 కి.మీ ఉంటుంది. ఇందులో ఆకాశమార్గం 29.3 కి.మీ, అండర్‌గ్రౌండ్‌లో 1.7 కి.మీ పొడవున పనులు జరుగుతాయి. కాగా విమానాశ్రయం టెర్మినల్‌కు అనుకొని ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో కలిపి రాయదుర్గం నుంచి విమానాశ్రయం వరకు 9 స్టేషన్లు రాబోతున్నాయి. అలాగే భవిష్యత్తు అవసరాల కోసం మరో నాలుగు స్టేషన్లు ఏర్పాటు చేసుకునేలా అలైన్‌మెంట్‌ను డిజైన్ చేశారు. భవిష్యత్తులో నార్సింగి, అప్పాకూడలి మధ్య మంచిరేవుల వద్ద ఒక స్టేషన్ వచ్చే అవకాశం ఉంది. అప్పాకూడలి, రాజేంద్రనగర్ మధ్యలో కిస్మత్‌పుర్‌లోనూ అదనపు స్టేషన్‌కు అవకాశం ఉంది. రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ మధ్యలో చాలా దూరంఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. ఎక్కువ సంస్థలున్నాయి. జనావాసాలు విస్తరిస్తే ఇక్కడ కూడా స్టేషన్ వచ్చే సూచనలున్నాయి.

మరోవైపు ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) టెండర్లు ఆహ్వానించింది. బిడ్డింగ్‌కు జులై 5 వరకు గడువు విధించింది. మెట్రో కాంట్రాక్ట్ విలువ రూ.5,688 కోట్లుగా నిర్ధరించిన విషయం తెలిసిందే.ఎంపికైన కాంట్రాక్టర్ మెట్రో రైలు వ్యవస్థకు అవసరమైన ఎలివేటెడ్ వయాడక్ట్, భూగర్భ పనులు, మెట్రో స్టేషన్లు, ట్రాక్ పనులు, ఎలక్ట్రికల్ మెకానికల్ పనులు, రైలు బోగీలు, ఎలక్ట్రిక్ ట్రాక్షన్, విద్యుత్ సరఫరా సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్స్, రైలు నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ గేట్లు మెదలైనవి పూర్తిచేయాల్సి ఉంటుంది.

విమానాశ్రయ ప్రాంగణంలో రెండు మెట్రో స్టేషన్లు ఒక డిపో



# మాదిగలకు 13 ఎమ్మెల్యే 2 ఎంపీ సీట్లు కేటాయించాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

**తార్నాక, మే 23 ప్రభాతవార్త:**

మేమెంతో మాకంత అనే నినాదంతో జూన్ 30న ఛలో హైదరాబాద్ పేరుతో ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించ బోతున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్..టిఎస్) రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ పేర్కొన్నారు. మంగళవారం ఓ.యూ దూర విధ్యాకేంద్రం హాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మరియు అనుబంధ సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని పార్టీలు మాదిగలకు 13 సీట్లను, 2ఎంపీ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామిలను నెరవేర్చాలన్నారు. గృహ నిర్మాణం కోసం రూ.3లక్షల నుంచి రూ.10లక్షలు పెంచాలని, ప్రతినియోజకవర్గంలో 5 వేల మందికి దళిత బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డప్పు...చెప్పు వృత్తి దారులకు రూ.2000వేలు పెన్షన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. మాదిగల డిమాండ్ల సాధనకై జూన్ 30న జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని సభను విజయవంతం చేయా లని కోరారు. కార్యక్రమంలో ఓ.యూ ప్రొ.కాశీం, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ధర్మారపు శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బంగారి శ్రీనివాస్, డప్పు శివరాజ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, యువసేన అధ్యక్షులు పొట్ట పెంజర రమేష్, ఎంఈఎఫ్ ఇంచార్జి సలేంద్ర బాబురావు, మహిళా అధ్యక్షురాలు వి.ఎన్.లక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

# భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్

**మెట్టుగూడ, మే 23 ప్రభాతవార్త:** భద్రతకు అధిక ప్రాధాన్య ఇవ్వాలని దక్షిణ మధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. డివిజన్ పరిధిలో నడుస్తున్న రైళ్ల భద్రతపై రైల్ నిలయంలో వివిధ శాఖ అధికారులతో జీఎం సమావేశం నిర్వహించారు. విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, నాందేడ్, డివిజన్ల డీఎంఆర్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో తనిఖీలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేకంగా గూడ్స్ షెడ్ల వద్ద భద్రతా అవసరాలకు అనుగుణంగా పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. గూడ్స్ షెడ్లనిర్వాహణ, సామర్థ్యం పెంపుదలపై సమీక్షించిన జీఎం ప్రైవేటు, సైడింగ్‌గుల వద్ద ట్రాక్‌ల నిర్వహణ, వర్క్‌సైట్ భద్రతా అవసరాలను ఎల్లప్పుడు పాటించేలా ప్రవైటు కాంట్రాక్టర్ల సూపర్ వైజర్లకు సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం భద్రతకు సంబంధించి ఉధ్యోగులకు ఇస్తున్న ట్రైనింగ్ క్లాసుల గురించి అధికారులతో జీఎం సమీక్షించారు.

### స్కూల్ బస్సుల వివరాలు ఇవ్వాలని పాఠశాలలకు నోటీసులు

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త :** విద్యార్థుల భద్రత దృష్ట్యా నార్సింగి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సులు, వాటిల్లో పని చేసే సిబ్బందికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు గండిపేట మండల పరిధిలోని పలు పాఠశాలలకు వెళ్లి పై వివరాలు 10.రోజులలోపు తెలుపాలని నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న బస్సులు/వ్యాన్‌లు ఎన్ని? వాటికి సంబంధించిన పూర్తి ఆర్‌సి, పర్మిట్,పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవర్, అటెండర్‌లు, బస్సుల పార్కింగ్‌కి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు. పిల్లల నడక దారికి తీసుకున్న చర్యల వివరాలు వివరించాలని తెలిపారు. గతంలో ఫిట్‌నెస్ లేని బస్సులు తోలడంతో విద్యార్థుల ప్రాణాలు పోయిన సంఘటనలున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ట్రాఫిక్ శాఖ నుంచి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని రోడ్డు భద్రతా నిబంధనలన్నింటిని స్వచ్ఛందంగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కవిత్వం చదివినప్పుడు స్పందించాలి

## అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రిశ్రీదేవి, స్వాతిశ్రీపాద, దామోదరాచారి, శ్యామల తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 23 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కొమర్రాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత్రి స్వాతి శ్రీపాద సభాధ్యక్షతన డా. ఎం.దామోదరాచారి ఆంగ్ల అనువాద ది వెర్మిలియన్ ఆఫ్ ది ఈస్ట్ పుస్తకావిష్కరణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి గౌరవ అతిథులు డా. ఎం.దామోదరాచారి, డా. శిలాలోలిత, కాసర్ల శ్యామ్, కె.వి.జ్ఞానకుమార్, మంథా శిరీష, శాంతికృష్ణ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత్రి డా. గడ్డం శ్యామల రచించిన తూర్పుసింధూరం పుస్తకానికి ఆంగ్ల అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించి చదివినప్పుడు గుండె కొట్టుకోవాలి ... స్పందించాలి ... సామాజిక సమస్యలకు పరిష్కారం చూపించగలిగేదే కవిత్వం అన్నారు. స్వాతి శ్రీపాద అధ్యక్షోపన్యాసంలో డిక్షనరీ తీయకుండా చదివించగలిగే మంచి పుస్తకామన్నారు. అనంతరం ది వెర్మిలియన్ ఆఫ్ ది ఈస్ట్ పుస్తకంపై తెలుగులో శాంతికృష్ణ, ఆంగ్లంలో మంథా శిరీషలు చక్కని సమీక్ష చేశారు.



సైఫాబాద్ ఆర్‌బిఐ వద్ద రెండు వేల నోట్లను మార్చుకునేందుకు వచ్చిన విదేశీయులు

# పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ గొప్ప వరం : మంత్రి తలసాని

**కంటోన్మెంట్, మే 23 ప్రభాతవార్త:**

ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటూ సరైన వైద్యం పొందలేక పోతున్న నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.కంటోన్మెంట్ నియోజకవర్గం 4వ వార్డు పికెట్‌కు చెందిన ఆటో డ్రైవర్ రవిగౌడ్ భార్య రమ్య చికిత్స కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2.50 లక్షల రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసానినివాసంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, నివేదితలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. రమ్య వెన్నుముక, నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యంతో మృత్యువాత పడకుండా కార్పోరేట్ ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, లబ్ధిదారుడి సోదరుడు



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

# 'సివిల్' ర్యాంకుల పంట

**చిక్కడపల్లి, మే 23 ప్రభాతవార్త:**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రానికి ర్యాంకుల పంట పండింది. మారుమూల గ్రామాలు,తండాలకు చెందిన విద్యార్థులు తమ సత్తాచాటారు. అశోక్‌నగర్‌లోని ప్రజ్ఞా ఐఏఎస్ అకాడమికి 73 ర్యాంకులు వచ్చాయి. ఆలిండియా మొదటి ర్యాంక్‌ను ఇషితా కిషోర్, రెండవ ర్యాంక్‌ను గరీమా లోహియా సంస్థకు చెందిన వారు కావడం గర్వంగా ఉందని ఆ సంస్థ మేనేజర్ తేజ వివరించారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 100లోపు 13 ర్యాంకులు, పదిలోపు రెండు ర్యాంకులు వచ్చాయని, ఐఏఎస్, ఐపీఎస్ అత్యున్నత పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు మరోసారి సత్తాచాటారన్నారు. అశోక్‌నగర్‌లోని సిబిఎస్ ఐఏఎస్ అకాడమీ సివిల్స్ ఫితాల్లో ప్రభంజనం సృష్టించింది. అకాడమి డైరెక్టర్, మెంటర్ బాలలత అద్భుతమైన శిక్షణ అందించడం ద్వారా 18 మంది విద్యార్థులు తమ సత్తాచాటారు. అకాడమి విద్యార్థులకు ర్యాంకులు రావడం సంతోషంగా ఉందని బాలలత సంతోషం వ్యక్తం చేశారు. కష్టపడి చదివితే సివిల్స్‌లో విజయం సాధించడం కష్టమేమి కాదని మరోసారి తమ సత్తా నిరూపించారని అన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన వారిని ఘనంగా సత్కరించారు. జీవిఎస్ పవన్ దత్త(22 ర్యాంక్), సాయి ఆశ్రిత్ శాఖమూరి(40 ర్యాంక్), డోంగ్రే(410)తో పాటు, 200, 222, 217, 285, 640, 759, 801, 885 ర్యాంకులు సాధించారన్నారు.

### ఆత్మవిశ్వాసంతో చదవి ర్యాంకు సాధించా పవన్ దత్త

ఆత్మవిశ్వాసంతో చదవి దేశస్థాయిలో 22వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని జీవిఎస్.పవన్ దత్త అన్నారు. ఆంథ్రోపాలజీ సబ్జెక్ట్ ద్వారా తాను సివిల్స్‌లో ర్యాంక్ సాధించడానికి ఉపయోగపడిందని, ప్రధానంగా సీబీఎస్ ఐఏఎస్ అకాడమి అధినేత్రి బాలలత ఎంతో ప్రోత్సహించారన్నారు. ఈ సందర్భంగా ఆయన పాడిన అన్నమాచార్య కీర్తన అందరిని మంత్రముగ్దులను చేసింది.

### లా ఎక్సిలెన్స్‌కు ర్యాంకుల పంట

అశోక్‌నగర్ లా ఎక్సిలెన్స్ ఐఏఎస్ అకాడమికి ర్యాంకుల పంట పండిందని సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఫౌండర్ రాంబాబు వివరించారు. తమ సంస్థ విద్యార్థి శ్రావణ్‌కుమార్‌రెడ్డి(426 ర్యాంక్), పి.హేమంత్(469), తుమ్మల సాయి కృష్ణ(640)లను ఘనంగా సత్కరించారు. తమ సంస్థ ద్వారా శిక్షణ పొందిన వందలాది మంది ర్యాంకులు సాధించారని అన్నారు. జాతీయస్థాయిలో మూడవ ర్యాంక్‌తో పాటు మొత్తంగా తమ సంస్థ విద్యార్థులు 25ర్యాంకులు సాధించారన్నారు.

### చిక్కడపల్లి నివాసికి 110 ర్యాంక్

కాగా చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన నిధి పాయికి సివిల్స్‌లో 110 ర్యాంక్ సాధించారు. విష్ణు ఐఏఎస్ అకాడమిలో కోచింగ్ తీసుకున్నానని అధినేత విష్ణువర్ధన్ వివరించారు. ఈ సందర్భంగా ర్యాంకులను సాధించిన వారిని సత్కరించారు. అదే విధంగా శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమికి 53 ర్యాంకులు సాధించగా అందులో 19 మంది అత్యున్నత ర్యాంకులు సాధించారని అకాడమి అధినేత తోట శరత్‌చంద్ర అన్నారు.

### సత్తాచాటిన తెలంగాణ విద్యార్థులు

కాగా ఈ దఫా సివిల్స్ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని విష్ణు ఐఏఎస్ అకాడమి అధినేత వివరించారు.



మొదటి ర్యాంక్ సాధించిన ఇషితా కిషోర్




ర్యాంకర్లతో బాలలత

# రహదారి నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం

**మైలార్‌దేవ్‌పల్లి, మే 23 ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఆరాంఘర్ నుంచి శంషాబాద్‌వరకుచేపట్టిన రహదారి నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ జాతీయ రహదారుల నిర్వాహణ సంస్థ అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ రహదారి పనులు యానభై శాతం పూర్తి అయ్యాయని, మిగత 20 శాతం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఎఐ,డిఇ,ఎఇ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడపడం చట్టవిరుద్ధం

**నాంపల్లి, మే 23 ప్రభాతవార్త :** భారతదేశంలో రోడ్డు ప్రమాదాలపై రోడ్డురవాణా, రహదారుల మంత్రిత్వశాఖ తాజా నివేదిక ప్రకారం రోడ్డు ప్రమాదాలకు మూడు ప్రధాన కారణాలున్నాయని, మొదటిది అతివేగం, రెండవది క్రమశిక్షణా రాహిత్య, మూడవది మద్యం సేవించి వాహనాలు నడపడమన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్‌స్టిట్యూట్ బేగంపేట అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జి. శంకర్‌రాజు 2017 మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185 ప్రకారం మద్యం తాగి వాహనాలు నడపడం చట్టవిరుద్ధం, ఇండియన్ పీనల్ కోర్టకింద శిక్షార్హమైనది హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రతీ సంవత్సరం 13,727 ప్రమాలు జరుగుతుండగా ఇందులో 6325 మంది మరణించగా 11564 మంది గాయపడ్డారని, 2022లో హైదరాబాద్‌లో మొత్తం 44,979 డ్రంక్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ సంబంధిత రోడ్డు ప్రమాదాలలో మరణించిన వ్యక్తులు మొత్తం రోడ్డుప్రమాదాల్లో 3.5శాతమున్నారని, గత ఏడాదితో పోలిస్తే ఈ మరణాల సంఖ్య మరింత పెరిగిందని ఆవేదన వ్యక్తపరిచారు. బేగంపేట టిటిఐ స్టాఫ్ హెచ్‌సి వీరమ్మ, సుమన్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో శంకర్‌రాజు ఈరోజు ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని మహవీర్ ఆస్పత్రి వద్ద రోడ్డుభద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా 120మంది సిబ్బందికి తెలియజేస్తూ రాంగ్‌రూట్ వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, స్టాప్‌లైన్, ట్రైలర్ రైడింగ్, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద వాహనాలు ఆపడం, రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణల గురించి వివరించి, మద్యం సేవించడం. అతివేగంవల్ల వాహనం నడిపేవారితోపాటు రహదారులపై ఇతరులూ ప్రమాదానికిగురై ఆరోగ్య, ప్రాణ, ఆస్తి కుటుంబీకులకు పలునష్టాలు సంభవిస్తున్నాయని, వేగంకన్నా ప్రాణంమిన్న, రహదారులపై క్రమశిక్షణ తప్పక పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మహవీర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాజేష్, మెడికల్ డైరెక్టర్ డా. శ్రీకృష్ణ, నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది హాజరయ్యారు.



రోడ్డుభద్రతా ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసిపి శంకర్‌రాజు

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు దుర్మరణం

**గచ్చిబౌలి, మే 23 ప్రభాతవార్త:**

ఔటర్ సర్వీసు రోడ్డు మీద ఉన్న డివైడర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్న చింటు(20) నానక్‌రాంగూడలోని ఓ కారు సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని చింటు ద్విచక్రవాహనంపై బోర బండకు బయలుదేరాడు.మార్గమధ్యలో నానక్‌రాం గూడ ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు మీద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో డివైడర్‌కు ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిన చింటు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### మరో యువకుడు...

**గచ్చిబౌలి, మే 23 ప్రభాతవార్త**

అదుపుతప్పిన ఓ కారు ముందు వెళ్తున్న కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా, ద్విచక్రవాహనం మీద వెళ్తున్న యువకుడు తీవ్ర గాయాలతో మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

వరంగల్‌జిల్లా కరీమాబాద్‌కు చెందిన సాయితరుణ్(21) నానక్‌రాంగూడలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు.గౌలిదొడ్డిలోని ప్రైవేటు హాస్టల్‌లో నివాసం ఉంటూ రోజు పనికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.40 గంటల ప్రాంతంలో నానక్‌రాంగూడ బైపాస్ రోడ్డు మీద సాయితరుణ్ తన ద్విచక్ర వాహనం మీద ప్రయాణిస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ జైలో కారు అదుపుతప్పి మొదట జీపును ఢీకొట్టింది. అనంతరం వేగం అదుపు కాకపోవడంతో ముందు వెళుతున్న సాయితరుణ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సాయితరుణ్ తాను ప్రయాణిస్తున్న హోండా యాక్టీవా వాహనం మీద నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



చింటు(ఫైల్‌ఫోటో)



సాయితరుణ్(ఫైల్‌ఫోటో)



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## గాంధీనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

**చిక్కడపల్లి, మే 23 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం బాపూనగర్, రాజరాజేశ్వరి దేవాలయం వీధి, పార్థివాడ, ఎస్ఆర్‌టి క్వార్టర్స్, లక్ష్మీగణపతి దేవాలయం వీధిలో వివిధ శాఖల అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పాత రోడ్లు ఉన్న చోట కొత్త రోడ్లు వేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, జిహెచ్ఎంసి డీఈ గీత, ఏఈ ఇస్మాయిల్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముఠా నరేశ్, పోతుల శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, లక్ష్మీగణపతిదేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, గుండు జగదీశ్, గడ్డమీది శ్రీనివాస్, జి.వై.గిరి, నర్సింగ్, పరుశురామ్, రవిశంకర్‌గుప్త, చందు, రామ్‌చందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలగూడ పిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**చిక్కడపల్లి, మే 23 ప్రభాతవార్త:** దోమలగూడ పోలీసుస్టేషన్ కొత్త ఇన్‌స్పెక్టర్‌గా దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇటీవలే నగర పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్ పోలీసుస్టేషన్‌ల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా దోమలగూడను ప్రత్యేక పిఎస్‌గా ఏర్పాటుచేశారు. 2004 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి గతంలో నర్సాపూర్, వనపర్తి, మిర్యాలగూడలో పనిచేశారు. ఏడాది కాలంగా పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, ఇతర కంట్రోల్ సెంటర్‌లలో పనిచేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి పోలీసు సబ్ డివిజన్ ఏసీపీ, గాంధీనగర్ పోలీసు సబ్‌డివిజన్ ఇంచార్జ్ ఏసీపీ ఎ.యాదగిరికి రిపోర్టు చేసి బాధ్యతలను స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషన్‌ను అరెస్టు చేయాలి



సంతకాలు సేకరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

**అడ్డగుట్ట, మే 23 ప్రభాతవార్త:** రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం అడ్డగుట్టలో సంతకాల సేకరణ జరిపి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి, ప్రతినిధులు ఆర్.అంజమ్మ, బి.పద్మ, ఎం.స్వరూప, ఎం.అలేఖ్య, సుధా, రాణి, యాకమ్మ, మాలతి పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : కొంతం దీపిక



గణేష్ దేవాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్, మే 23 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. సికింద్రాబాద్‌లోని శ్రీగణేష్ దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు కొంతం నరేశ్, వీరవర్ధన్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

## నేడు మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

**చాంద్రాయణగుట్ట, మే 23 ప్రభాతవార్త :** ఉప్పుగూడ శ్రీ మహంకాళి దేవాలయం ఆవరణలో రూ.4.96 కోట్లతో ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న జీప్లెస్ 3 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు బుధవారం పశు సంవర్ధక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ భూమిపూజ చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జనగామ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొని నూతనంగా నిర్మించనున్న ఫంక్షన్‌హాల్‌కు ఉదయం 10.30 గంటలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు మధుసూదన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, వివిధ దేవాలయాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలి

**హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త:** గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్ గార్డెన్ కాలనీలో వివిధ లైన్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిహెచ్ఎంసికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రధానకార్యదర్శి మధుసూదనాచారి జిహెచ్ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని వివిధ లైన్ లలోఉన్న రోడ్లు మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభిం చాలని లిటిల్ ఫ్లవర్ బిల్డింగ్ లైన్‌లోని రోడ్డు, మైసమ్మ దేవాలయం పక్క లైన్‌లోని రోడ్డు, ట్రాన్స్ ఫార్మర్ ఎదురుగాగల రోడ్‌లైన్ పనులను పూర్తి చేయాలని కోరారు.

## మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి : ఏసిపి

**చార్మినార్, మే 23 ప్రభాతవార్త :** హుస్సేనీఆలంలోని శ్రీకాలభైరవ్ హనుమాన్ మందిరంలో నవగ్రహ పూజ కార్యక్రమం జరిగింది. చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్, హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి రుద్ర భాస్కర్ మాట్లాడుతూ మన దేశ, సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. మందిరం కమిటీ ప్రతినిధులు పంకజ్‌నాగేందర్, పవన్ జాజులు ఎసిపి రుద్రభాస్కర్, సిఐ నరేష్ కుమార్‌లను శాలువ కప్పి సన్మానించారు.

## బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం : శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్, మే 23 ప్రభాతవార్త :** తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కరెంటు చార్జీలు, నల్లా బిల్లులు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచటం మినహా అభివృద్ధి శూన్యమని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ ఒకటి, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలలో మంగళవారం ప్రజల ఘోష బిజెపి భరోసాలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి డివిజన్ అధ్యక్షులు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో బిజెపి కట్టుబడి వుందన్నారు. స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ సొమ్ముచేసుకునేందుకే తప్ప అభివృద్ధికి పనికిరాడని విమర్శించారు. జాబ్‌మేళాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడంతప్ప ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించాడో చెప్పాలని ఆయన ఎంఎల్ఎకు సవాల్ విసిరారు. స్థానికంగా సుదీర్ఘకాలంగా నెలకొని ఉన్న సమస్యలను కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గడ్డం రాజేందర్‌రెడ్డి, సి.ఆర్.నటరాజ్ గౌడ్, కృష్ణయాదవ్, దయాకర్, దుర్గారావు, వెంకటేశ్‌యాదవ్, అలివేలు, సత్యం, భూషనం, రవి, నందకిశోర్, ముద్దం రవి, ఉమామహేశ్వర్, రాము, పురుషోత్తం, అశోక్, సురేందర్, శ్రీనివాస్, ఎల్లారెడ్డి, శంకర్, ప్రసాద్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్య, వైద్యం అందించాలని నేడు నిరాహార దీక్ష

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త:** ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరా పార్కు ఎదట ధర్నా చౌక్‌లో నిరాహారదీక్ష చేపడుతున్నామని పీపుల్స్ ప్రొటక్షన్ పార్టీ, ఉచిత విద్య, వైద్యం సాధన సమితి ప్రకటించాయి. మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉంద్యాల సదానందరెడ్డి, సమితి అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ తదితరులు ఈ నిరాహారదీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దీక్షలో విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, విద్యావంతులు, విశ్లేషకులు, కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకులు పాలకుల, అధికారుల స్వలాభం, అవినీతి కారణంగా ప్రజలకు అందని ద్రాక్షాగా విద్య, వైద్యం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వీరు ఒకపథకం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలను తీసుకొచ్చి ప్రజల సంపదను, శ్రమను దోచుకుంటూ ఉసురు తీస్తున్నారని పేరుకు మాత్రం ప్రజల కోసం అంతా ఖర్చు చేస్తున్నామని చెపుతూ ప్రజలకు మేలుచేసిన పాపానపోలేదని ఆరోపించారు. విద్య, వైద్యం ప్రజల హక్కని ఉచితంగా అందించాలని డిమాండ్‌చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అన్ని అసెంబ్లీ స్థానాలలో పోటీచేస్తుందని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉచితంగా విద్య,వైద్యం అందిస్తామని పెదతామని వారు స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు బొమ్మ వెంకటేశ్వర్లు, నర్సింహా, ఎం.రాజు, ధనమ్మ పాల్గొన్నారు.





వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సదానందరెడ్డి, ప్రవీణ్‌కుమార్



బండి సంజయ్ సమక్షంలో బిజెపిలో చేరిన గోవింద్‌రాఠి

## బిజెపిలో చేరిన గోవింద్ రాఠి..

**అఫ్జల్‌గంజ్, మే 23 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ సమక్షంలో గోవింద్‌రాఠి సొంతగూటికి చేరారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మన్, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్‌బన్సల్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, బేగంబజార్ డివిజన్ కార్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్ సమక్షంలో గోవింద్‌రాఠి, మనోజ్‌జైస్వాల్, వై.బాబుగురు బిజెపిలో చేరారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

### బిఆర్ఎస్ గూటికి...



నందకిషోర్‌వ్యాస్(బిలాల్) సమక్షంలో చేరిన పంచ్‌కమిటీప్రతినిధులు

**గోషామహల్, మే 23 ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్(బిలాల్) అన్నారు. మంగళవారం ఉప్పర్‌దూల్‌పేట్ పంచ్‌కమిటీ సభ్యులు బాగేష్‌సింగ్ లోథ్‌తో పాటు పలువురు ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత ్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బేగంబజార్ డివిజన్ ఇన్‌చార్జ్ పూజావ్యాస్, బిఆర్ఎస్ నాయకులు శంకర్‌సింగ్‌జమేదార్, బాల్‌దీప్‌సింగ్, కవిత, పుష్ప, గోపాల్‌సింగ్ లోథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ



పిట్టల రవీందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త:** రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన పిట్టల రవీందర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతుంది. రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి మల్లేష్ ముదిరాజ్ తన అనుచరగణంతో వెళ్లి రవీందర్‌కు పుష్పగుచ్చాలిచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా మల్లేష్ మాట్లాడుతూ చేపల పెంపకం, మార్కెటింగ్‌లపై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటే ముదిరాజ్ సోదరులు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని మార్కెట్లలో చేపలు విక్రయించేందుకు అవకాశం కల్పించాలని, చెరువులన్నింటిలో చేపలు పెంచి ముదిరాజ్‌లను ఆదుకోవాలని చైర్మన్‌ను కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గడ్డ కుమార్ ముదిరాజ్, నాయకులు శ్రీరాములు, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**చార్మినార్, మే 23 ప్రభాతవార్త :**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు సీని యర్ బిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్ అన్నారు. ఘాన్సీబజార్‌లో జరుగుతున్న బోరింగ్ మరమ్మతుల పనులను ఆయన మంగళవారం పరిశీ లించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బోరింగ్ ప్రక్కనే ఉన్న కచ్చామోరీలను పరిశుభ్రం చేయటం జరిగిందని, బోరింగ్‌కు చుట్టూ ఫ్లాట్ ఫారం కట్టడం వల్ల ప్రజలకు ఉపయోగం కలుగుతుందని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు సునీల్ కుమార్ అగర్వాల్‌తో పాటు జిహెచ్ఎంసి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిందు, యక్షగాన కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ



నూతనంగా ఏర్పాటైన కమిటీ ప్రతినిధులు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** చిందు యక్షగాన కళాకారుల సంఘం నూతన రాష్ట్రకమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్షులుగా గడ్డం స్వామి (యాదాద్రి జిల్లా), కార్యనిర్వాహక అధ్యక్షులుగా గడ్డం హిమగిరి (జనగామజిల్లా) ఉపాధ్యక్షులుగా గడ్డం సుదర్శన్ (వరంగల్), గడ్డం పెద్దులు (రంగారెడ్డి), జి.నరహరి (ములుగు), ప్రధాన కార్యదర్శిగా పిల్లిట్ల ముకుందం (యాదాద్రి), పిల్లిట్ల రమేష్ (సిద్దిపేట జిల్లా), పిల్లిట్ల చంద్రమౌళి (యాదాద్రి భువనగిరి), గౌరవ అధ్యక్షులుగా గడ్డం సమ్మయ్య (జనగామ ), గజెవల్లి గణపతి (హన్మకొండ), గడ్డం వెంకటేశ్వర్లు ,పిల్లిట్ల పశుపతి, సినీనటుడు జబర్దస్త్ రాజమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్బంగా చిందు హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గణపతి మాట్లాడుతూ రాష్ట్రంలో అంతరించి పోతున్న చిందు యక్షగాన కళాకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిందుయక్షగాన కళాకారులు, అభ్యున్నతికి ఐక్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం



అభివాదంచేస్తున్న సుధాకర్‌రెడ్డి, దూసరి శ్రీనివాస్‌గౌడ్, పులిజగన్, తదితరులు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** అంబర్‌పేట్ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను 21రోజులపాటు వివిధ రూపాల్లో ఘనంగా నిర్వహిస్తామని అంబర్‌పేట్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ఎండ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. పదేళ్లుగా సిఎం కెసిఆర్‌చేసిన సంక్షేమ పథకాలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల్లోకి సంక్షేమ పథకాలు తీసుకెళ్లడం ద్వారా అంబర్ పేట్‌లో రెండోసారి బిఆర్ఎస్ జెండా ఎగరేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గరిగంటి రమేష్, దూసరి శ్రీనివాస్‌గౌడ్, సుశీలారెడ్డి, మాజీ కార్పొరేటర్ పులి జగన్, కె.మురళీకృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి, నాగేష్‌గౌడ్, జీవన్‌గౌడ్, గోట్ల రాములు, రాహుల్ ,జనార్ధన్, నందు, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి హయాంలోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి

**చార్మినార్, మే 23 ప్రభాతవార్త :** బిజెపి హయాంలోనే దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి చెందిందని మాజీ బిజెపి మైనార్టీ మోర్చ అధికారి ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. పాతబస్తీ దారుషిఫాలో ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ భారత దేశం నుంచి ఈ సంవత్సరం 1,75,025 మంది హజ్ యాత్రికులు హజ్‌కు వెళుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు ఇచ్చే రాయితిని నిలిపి వేసిందని, నిలిపి వేసిన ఆ రాయితీని ముస్లిం మైనార్టీ విద్యార్థుల విద్య కోసం కేటాయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిజెపి తప్పకుండ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





అమీర్‌పేటలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న నటుడు గెటప్ శ్రీను, నటి కామాక్షి, కృష్ణచైతన్య



దేవేందర్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీవాసులు

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

**నాచారం, మే 23 ప్రభాతవార్త:** స్థానిక సమస్యలపై కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి మల్లాపూర్ బ్యాంక్ కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు, అసోషియేషన్ రెండవ అంతస్థు నిర్మాణం చేపట్టాలని, రోడ్‌నెం.6,7,8 తదితర ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్ ఇంటర్నల్ కనెక్షన్లను మంజూరు చేయించాలని వినతిపత్రంలో కోరారు. అందుకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పన్నాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బిజాదు అంజయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.శ్రీనివాస్ నాయుడు, వి.శివ శంకర్, కనకయ్య, రాజ్‌కుమార్, సుబ్రమణ్యం, హరిబాబు, బ్రహ్మయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిద్ధార్థ్ కాలేజ్‌లో రాజీవ్‌గాంధీ యూత్ అన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్

**మూసాపేట, మే 23, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని సిద్ధార్థ్ కాలేజ్‌లో మంగళవారం ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయాద్ మిస్బా ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో భాగంగా గొట్టిముక్కల వెంగళరావు విద్యార్థులను కలవడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ కాంపిటేషన్‌లో పాల్గొని తమ మేధాశక్తిని పరీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 121 డివిజన్ ప్రెసిడెంట్ మేకల రమేష్, నాగార్జున, గురుమూర్తి, బండారి ప్రవీణ్‌గౌడ్, పల్లపు వేణు, నిఖిల్, వంశీ, చందు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**మూసాపేట, మే 23, ప్రభాతవార్త :** 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజెఆర్‌నగర్ బ్లాక్‌నెంబర్ 18లో నివసించే పి.రాజు (26) ఆత్మహత్య చేసుకుని మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కుమారుడు దొడ్ల రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్టు ద్వారా 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌నాయక్, అగ్రవాసు, బాలస్వామి, వాసు దేవరావు, రవీందర్, ఐలయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ పదవి బాధ్యతలు స్వీకరణ

**బేగంబజార్, మే 23 ప్రభాతవార్త:** అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన సుధాకర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కామాటిపురా అదనపు ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన శ్రీనివాస్ అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్బంగా తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త మర్యాదపూర్వకంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌ను కలిసి బొకె అందచేసి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు నందకిషోర్ అగర్వాల్, రాజారామ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాను : పరశరామ్

**కంటోన్మెంట్, మే 23 ప్రభాతవార్త:**



సమావేశంలో బిజెపి నేత పరశరామ్ తదితరులు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా 12 సంవత్సరాలు సర్వీస్ చేసి కంటోన్మెంట్ ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ పార్టీల్లోకి వచ్చినట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ అధికారి పరశరామ్ తెలిపారు. మంగళవారం 5వ వార్డు జ్యోతి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పరశరామ్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మట్‌పోర్ట్ ప్లే గ్రౌండ్‌లో 5 వేల మంది కార్యకర్తలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ల సమక్షంలో బిజెపి పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. సభకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అశోక్, ధనుంజయ చారి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లోని నాలాల అభివృద్ధికి కృషి చేస్తా : మర్రి రాజశేఖర్‌రెడ్డి



నాలా పరివాహక ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్, మే 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌లోని నాలాల పరివాహక ప్రాంతాల చుట్టుప్రక్కల ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ 4వ వార్డులోని ఎరుకల బస్తీ, బూసరెడ్డిగూడ, జూబ్లీ బస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న నాలా స్థితిగతులను మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, పాండు యాదవ్‌తో కలిసి పర్యవేక్షించారు. రానున్న వర్షాకాలంలో నాలా చుట్టుప్రక్కల ఉన్న ప్రజలకు ఎలాంటి నష్టం జరుగకుండా నాలాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కెటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, పనస శ్రీకాంత్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యూనెట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త:** ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి వందలాది మంది నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు వసూలుచేసి భారీ మోసానికి పాల్పడ్డ క్యూనెట్ (విహన్ డైరెక్ట్ సెల్లింగ్) యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం బాధితుల పెట్టిన పెట్టుబడి తిరిగి ఇప్పించాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని సెంట్రల్ క్రైంస్టేషన్‌లో ఆర్థిక నేరాల టీమ్-2 అసిస్టెంట్ కమిషనర్ ఎన్.అశోక్‌కుమార్‌కు బాధితులతో ఆయన కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ అధిక ఆదాయాలను వాగ్దానం చేసి ఉద్యోగాలు కల్పిస్తామని సికింద్రాబాద్, నాచారం, హబ్సిగూడలలో క్యూనెట్ యాజమాన్యం కోట్లాది రూపాయలు దండుకుని 300 మంది నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది బాధితులు ఉండవచ్చునని, బాధితులంతా బడుగు బలహీనవర్గాలకు చెందినవారేనని చెప్పారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారిలో ఆరుగురు క్యూనెట్ ఉద్యోగులతోపాటు ఆ సంస్థలో పెట్టుబడి పెట్టి దోపిడీకి గురైన బాధితులందరికి న్యాయం చేస్తామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్థిక చట్టాలను అమలు చేసి ఆర్థిక నేరాలపై పోరాడే బాధ్యత కలిగిన కేంద్ర ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా కూ నెట్ సంస్థ నుంచి 137 కోట్లు సిజ్ చేసి బాధితులకు సత్వరమే న్యాయం చేయక పోవడం దారుణమన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆప్ నాయకులు ఎండి మజీద్, బాధితులు దీపికా, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదును అందజేస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్



సికింద్రాబాద్‌లోని ఓ వైన్‌షాపులో 2వేల నోట్లను తీసుకుంటున్న వ్యాపారి

# మంత్రి చొరవ వల్లే అర్హులకు సంక్షేమ ఫలాలు : మేయర్




లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఎమ్మార్వో జనార్ధన్‌రావులు

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: రాష్ట్ర విదా ్యశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవవల్లే మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు అన్నారు. బాలాపూర్ మండల తహసీల్దార్ జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాల యంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార ్యక్రమం జరిగింది. కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార ్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు రాజకీయాలకతీతంగా పలువు రు కార్పొరేటర్లతో కలిసి వివిధ డివిజన్లకు చెందిన 53 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా సబితా ఇంద్రారెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. కార్పొరేషన్‌లో అభివృద్ధికి బాటలు వేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదల వైద్య చికిత్సలకు ఆదుకుంటున్న మంత్రి సబితారెడ్డికి వారు కార్పొరేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మోడల బాలకృష్ణ సాగర్, చెవ్వ మణెమ్మ, సిద్దాల లార్డ్స్ బీరప్ప, వేముల నర్సింహ, గజ్జెల రాంచందర్, ఉయ్యాల నవీన్‌గౌడ్, ఇంద్రావత్ రవినాయక్, మమతా ప్రవీణ్, ధరంకార్ జ్యోతి కిశోర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, సిద్దాల పద్మ అంజయ్య, కో–ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ ్యగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, ఆర్‌ఎన్‌రెడ్డినగర్ గీతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ : మేయర్, డిప్యూటీ మేయర్




చెక్కులను పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లకు సంబంధించిన చెక్కుల పంపిణీ జరిగింది. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు వివిధ డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఎమ్మార్వో జనార్ధన్‌రావు, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి ఫ్లోర్ లీడర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, జెనిగె భారతమ ్మ కొమురయ్య యాదవ్, ముత్యాల లలితా కృష్ణ, బొద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, యా తం పవన్ యాదవ్, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రూ. 35 లక్షలతో బాక్స్ డ్రైన్ పనులు : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి, మే 23 ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో రూ. 35 లక్షలతో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమంకోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు సత్యనారాయణ, సంపత్‌రావు, కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాదరి కిశోర్ వెంటనే క్షమాపణలు చెప్పాలి : టి ఎంఆర్‌పిఎస్

మన్సూరాబాద్, మే 23 ప్రభాతవార్త : ఎంఆర్‌పిఎస్ నాయకులను దూషించిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ తన నోటిని హద్దులో పెట్టుకోవాలని, వెంటనే ఎంఆర్‌పిఎస్ నాయకులను ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ ఎల్‌బినగర్ అధ్యక్షుడు ద్యావని నర్సింహ డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎల్‌బినగర్‌లో డా.బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ఎమ్మెల్యే గాదరి కిశోర్ అధికార దాహంతో పాటు ఆర్థిక బలంతో ఇష్టమెచ్చిన ట్లు మాట్లాడడం తగదన్నారు. వెంటనే ఆయన ఎంఆర్‌పిఎస్ నాయకులకు క్షమాపణ చెప్పాలని లేకుంటే తగిన విధంగా బుద్ధి చెపుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రుక్కమ్మ మాదిగ, జిడి నర్సింహ, సుగుణమ్మ, యోసోఫ్, జయన్న, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



డ్రైనేజీ సమస్యలను సిబ్బందితో పరిష్కరింపజేస్తు్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, మే 23 ప్రభాతవార్త : ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్ మార్క్స్ విజన్‌వద్ద పాత రోడ్డును తొలగించే సమయంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూర్తిగా విరిగిపోవడంతో రెండు రోజులుగా డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తుందని స్థానికులు కార్పొరేటర్‌దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే ఆమె స్పందించి జిహెచ్‌ఎంసి జలమండలి విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా మ్యాన్ హోల్స్‌ను పునర్మించాలని జలమండలి సిబ్బందికి ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు సత్తిరెడ్డి, షకీల్, యాదయ్య, కాలనీవాసులు రామకృష్ణ, కృష్ణమూర్తి, మల్లేష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం : సిఐటియు

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తుందని సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు మల్లెపాక వీరయ్య విమర్శించారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని అన్ని రంగాలలో పని చేసే కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో దిల్‌సుక్‌నగర్‌లోని బోడపూడి వెంకటేశ్వర భవనంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మేకల కృష్ణ అధ్యక్షతన శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం ఐక్యతను సాధించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించే విధంగా కార్మికవర్గం ఐక్యతను చాటుకోవాలన్నారు. మతాన్ని రాజకీయ స్వార్థం కోసం కేంద్ర ప్రభుత్వం వాడుకుంటుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకరిస్తూ ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.చైతన్య, సిహెచ్.నవీన్, కే.యశోద, బి.నరసింహ, బి.బిక్షపతి, ఎన్.లింగయ్య, నాగమణి, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

## మీర్‌పేట్ పిఎస్‌లో మహిళా కౌన్సిలింగ్ కేంద్రం ప్రారంభం



ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎల్‌బినగర్ డిసిపి సాయిశ్రీ

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: రాచకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిడిఇడబ్ల్యూ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్) మహిళా కౌన్సిలింగ్ కేంద్రం ప్రారంభమైంది. రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ సూచనలతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌బి నగర్ జోన్ డిసిపి బి.సాయిశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనస్థలి పురం ఎసిపి పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డి, పలువురు ఎస్‌ఐలు, సిబ్బందితో పాటు సిడిఇడబ్ల్యూ మహిళా కౌని ్సలర్ మహారాణి, ప్రతినిధి శ్రావణి తదితరులు పాల్గొన్నారు. కేంద్రం ప్రారంభం సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలోని కుటుంబాల్లో తలెత్తే చిన్నపాటి వివాదాలకే మహిళలు పిఎస్‌లకు వచ్చి ఫిర్యాదు చేస్తూ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారనీ అట్టి వారి కోసమే ప్రభుత్వం పోలీస్‌శాఖ తరపున కౌన్సిలింగ్ సెంటర్లను పిఎస్‌లలో ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ఇట్టి సెంటర్లలో పిఎస్‌లకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళలకు మొదట శిక్షణ పొందిన మహిళా కౌన్సిలర్, ఎగ్జిక్యూటివ్ ద్వారా వివరాలు తెలుసుకొని కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో మీర్‌పేట్ పిఎస్‌పరిధిలోని మహిళల్లో ఎవరికైనా కుటుంబ పరమైన సమస్యలు, జీవితంలో ఎదురయ్యే సమస్యలు ఉంటే పిఎస్‌కి వచ్చి సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నకిలి విత్తనాల విక్రయదారులపై పిడి యాక్ట్ : రాచకొండ సిపి డి.ఎస్.చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమీషనర్ డి.ఎస్.చౌహాన్

మన్సూరాబాద్, మే 23 ప్రభాతవార్త: నకిలీ విత్తనాల సరఫరా జరగకుండా అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ డి.ఎస్.చౌహాన్ పేర్కొన్నారు. మంగళవారం ఎల్‌బినగర్ సిపి క్యాంపు కార్యాలయంలో నకిలీ విత్తనాల సరఫరా, క్రయా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కమీషరేట్ పరిధిలో నకిలీ విత్తనాలను, ఎరువులను, నాసిరకం పురు గుల మందులను అమ్ముతూ రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్న వారిని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులకు తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. నకిలీ విత్తనాలను అమ్మే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామన్నారు. గత ఐదేళ్ళలో నకిలీ విత్తనాలు విక్రయించిన సుమారు 14మందిపై పీడి యాక్టు నమోదుచేయడం జరిగిందని తెలిపారు. ప్రజలుసైతం నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలుచేసి మోసపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు ధృవీకరించిన ప్రముఖ కంపెనీలకు సంబంధించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించామని, వ్యవసాయఅధికారులతో సమన్వ యం చేసుకుంటూ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. నకిలీ విత్తనాల గురించి ఎవ్వరికితెలిసిన వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి, మేడ్చెల్ మల్కాజిగిరి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కొత్త ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న మద్ది మహేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మీర్‌పేట్‌కు కొత్త ఇన్ ్సపెక ్టర్‌గా కె.కిరణ్‌కుమార్ బదిలీపై రానున్నారు. ప్రస్తుతం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న ఆయనను కమీషనర్ మీర్‌పేట్‌కు బదిలీ చేశారు. అయితే బదిలీ అయిన ఇన్స్‌పెక్టర్లు రిలీవ్, ఛార్జ్ తీసుకోవాల్సి ఉంది.

## వర్షాకాలంలో సరూర్‌నగర్ కట్ట క్రింద ముంపు తగ్గించేందుకు చర్యలు: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త : రానున్న వర్షాకాలంలో కాలనీలో ముంపుకు గురి కాకుండా అవసరమైన పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ కట్ట క్రింద జరుగుతున్న బండ్ పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియదర్శిని పార్క్ మసీదు వద్ద గతంలో మూడు గేట్లు పెట్టడం జరిగిందని, దానికి అనుగుణంగా మరో మూడు గేట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారీ వర్షాలుపడి చెరువులో నీరు బయటకువచ్చి కాలనీలు ముంచెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలుగా టన్నలింగ్ వ్యవస్థ ఎర్పాటు చేస్తున్నామని అన్నారు. టన్నలింగ్ ఎర్పాటు దాదాపు మూడు, నాలుగు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు.పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ చివరివరకు పనులు పూర్తి చేయలన్నారు. చెరువులో నీటిమట్టాన్నీ తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న మూడో టన్నల్ వల్ల చెరువులో ఉన్న నీరు త్వరగా బయటకు పోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నీరు ఓవర్ ఫ్లో కాకుండా క్రింద ఉన్న కాలనీలైన కోదండరాంనగర్ కాలనీ, పిఅండ్‌టీ కాలనీలు ముంపు ప్రాంతం నుంచి రక్షించబడతాయని తెలిపారు. పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల వరద తీవ్రత 80% తగ్గడం జరుగుతుందని, ఎంత భారీ వర్షం వచ్చిన కాలనీలు జలమయంకాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



మందులు అందజేస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు

నాచారం, మే 23 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్ పేర్కొన్నారు. వీఏపీ హుమన్ రైట్స్ అసోషియేషన్ మరియూ మల్లారెడ్డి హాస్పిటల్స్ సౌజన్యంతో జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఒబైద్ ఆద్వర్యంలో కళ్యాణ్‌పురిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్ శిబిరాన్ని ప్రారంభించి రోగులకు మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈలాంటి శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. బస్తీలల్లో కూడ హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి పేదలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి హరీష్ రావు ఆద్వర్యంలో ఆరోగ్య భద్రత విషయంలో అనే సంస్కరణలు తీసుకొచ్చి రోగులకు అండగా ఉంటున్నారని కొనియాడారు. హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసిన నిర్వాహకులు, వైద్యబృందాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బజార్ జగన్, ఎద్దుల కొండల్ రెడ్డి, జావేద్, ఖాజా, బింగి శ్రీనివాస్, ఎండీ షఫి, మక్దుమ్, ఉపేందర్, ముద్దం శ్రీనివాస్, ఫోటో బాలు, ఎండి హనీఫ్, గౌస్, ఎస్‌కే. షఫీ, అహ్మద్ మియాన్, శబాతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వేగవంతంగా నూతన ఓటర్ల నమోదు : డిసి



సమావేశంలో ప్రసంగిస్తున్న డిసి జయంత్

మలక్‌పేట, మే 23 ప్రభాతవార్త : మలక్‌పేటనియోజకవర్గంలో నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుందని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో వివిధ రాజకీయపార్టీల నాయకులు, బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్స్‌లో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 300ల బిఎల్‌ఓలు, 30మంది సూపర్‌వైజర్లను ఆయన రాజకీయ నాయకులకు పరిచయం చేయడం జరిగింది. కాగా ఓటర్ల కార్డులు ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ కావడంలేదని ఒకే కుటుంబానికి చెందిన కొంతమంది ఓటర్ల పేరు ఒ బూత్‌లో ఉంటే మరికొంత మందివి వేరే పోలింగ్ బూత్‌లో ఉండడంతో ఇబ్బందులు ఎదురువుతున్నాయన్నారు. కొంతమంది బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల లిస్టును పరిశీలించడంలేదని, షిఫ్టింగ్ అని చెప్పి కొంతమంది ఓటర్ల పేర్లను ఓటర్ల లిస్టునుండి తొలగిస్తున్నారని, నూతన ఓటర్ల డాటా అప్రూవల్ ఇవ్వడంలేదని పలువురు రాజకీయా నాయకులు సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిసి జయంత్ మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, వివిధ పార్టీల నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, గూడూరు యాదిరెడ్డి, నవీన్‌రెడ్డి, అబ్రార్, హాజీ, లాయఖ్ అలీ, మన్నన్, అధికారులు గోవింద్‌రెడ్డి, ప్రకాష్, సునీత, వెంకన్న, మల్లికార్జున్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి అధికారులతో సమావేశం : కార్పొరేటర్ అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త : డివిజన్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సూచించారు. నాగోల్ డివిజన్ కార్పొరేటర్ నివాసంలో జలమండలి అధికారులతో డ్రైనేజీ, మంచినీరు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ చూసినా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. డ్రైనేజీ పొంగిపొర్లకొండ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జలమండలి జిఎం వినోద్‌కుమార్, డీజీఎం మాధవి, మేనేజర్ అలేఖ్య, అర్చన పాల్గొన్నారు.

## ఇతర కాలనీల రోడ్ల కోసం కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు : టౌన్ ప్లానింగ్



భారీ పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేత పనులు

తుర్కయంజాల్, మే 23 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ లక్ష్మి మెగాటౌన్‌షిప్‌నుంచి ఇతర కాలనీలకు అనుసంధానంగా రెండు చోట్ల అధికారులు గోడను కూల్చివేశారు. ఇబ్రహీంపట్నం ఎసిపి ఉమామహేశ్వర రావు, ఆదిబట్ల సీఐ రవికుమార్ పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మెగా టౌన్‌షిప్ కాలనీ వాసులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమది గేటెడ్ కమ్యూనిటీ అని, ఇక్కడ నుంచి వేరే కాలనీలకు రోడ్డు ఇచ్చే ప్రసక్తే లేదని భీష్మించి కూర్చున్నారు. పలువురు ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి పనులు కొనసాగించారు. ఈ సందర్భంగా పోలీసులు,అధికారులు మాట్లాడుతూ హైకోర్టు, హెచ్‌ఎండీఏ నుంచి సాయిలక్ష్మినగర్ వాసులు ఆర్డర్లు తెచ్చుకున్నారని, కోర్టు ఆదేశాల మేరకు రోడ్డుకోసం కూల్చివేతలు చేపట్టామని తెలిపారు. ఏమన్నా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, అనవసరంగా ఆందోళనలు చేసి కేసుల పాలు కావొద్దని హెచ్చరించారు. లక్ష్మి మెగాటౌన్‌షిప్‌నుంచి దారి తీయడంతో పాటిగూడ, సాయిలక్ష్మినగర్, శోభానగర్‌తో పాటు అనేక కాలనీలకు రోడ్డు సౌకర్యం సులభమైందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్



ట్రాఫిక్ డిసిపి అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్చాలను అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

మలక్‌పేట, మే 23 ప్రభాతవార్త : మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పదవీ బాధ్యతులు చేపట్టారు. గతంలో ఇక్కడా ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన జ్యోత్స్న బదిలీ అయ్యారు. మహబూబ్ నగర్ మాద్గులలో 2004బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ ఎస్‌ఐగా మొదట పోస్టింగ్ అయ్యారు. 2006 నుండి 2008వరకు గట్టు పోలీస్ స్టేషన్, ఎస్‌ఐఎలో నాలుగు సంవత్సరాలు, ఆఫ్జల్‌గంజ్‌లో డిఐగా నాలుగు సంవత్సరాలు, ఐటి సెల్‌లో నాలుగు సంవత్సరాలు, నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఒక సంవత్సరం విధులు నిర్వహించిన ప్రవీణ్ కుమార్ బదిలపై మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## యూజీడి సమస్యను పరిష్కరించాలని వినతి : కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్




జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీవాణి

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త : డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న యూజీడి పైప్ లైన్ నిర్మాణం పనులను వెంటనే పరిష్కరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళ వారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, సరూర్‌నగర్ ఉపకమిషనర్ హరికృష్ణయ్యలను కలిసి సరూర్‌నగర్ డివిజన్లో మంజూరు అయినా యుజిడి పైప్‌లైన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయపురికాలనీ, జేబీకాలనీ, ఇండోర్ స్టేడియం వద్ద నాలా పనులు, లక్ష్మీనగర్, ఎస్బిఐకాలనీ వెంకటేశ్వరకాలనీ, క్రాంనగర్, శంకర్‌నగర్,అంబేద్కర్‌నగర్‌లలో కొత్త రోడ్లు నిర్మించాలని కోరారు. అదేవిధంగా వర్షాకాలంలో వరదనీరు సమస్య తలెత్తకుండా వరదనీరు నిల్వ ఉండకుండా అవసరమైన పనులను చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కొత్తపేటచౌరస్తా వద్ద వీధి కుక్కల నిర్మూలన చేయాలన్నారు. భగత్‌సింగ్ నగర్, శంకర్‌నగర్, చౌడిభవన్, లక్ష్మీనగర్ మహిళా భవనాలు, కమ్యూనిటీ హాల్స్ పనులను తక్షణమే ప్రారంభించాలని వారిని కోరారు.

## బ్రహ్మాండానికి నాయకుడు గోవిందుడే : శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ



దర్శనం అనంతరం మాట్లాడుతున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

కుషాయిగూడ, మే 23 ప్రభాతవార్త : అండపిండ బ్రహ్మాండాన్ని అంత కాపాడేది గోవిందుడు ఒక్కడే అవధూత దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. తిరుపతి తిరుమల వెంకటేశ్వర స్వామి వారి దర్శనం అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గోవిందుడు లోక నాయకుడని ఆయన ఒక్క నామస్మరణతో ఉపద్రవాలు సైతం తొలగిపోతాయని పేర్కొన్నారు. స్వామివారిని ఒక్క రెప్పపాటు దర్శనం సైతం జీవితాన్ని మార్చి వేస్తుందన్నారు. పవిత్రమైన స్వామివారి ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచే క్రమంలో ప్రతి భక్తులు తమ వంతు చిత్తశుద్ధిని ప్రదర్శించాలన్నారు. ఒక్కరోజు స్వామివారిని ఆరాధిస్తే జీవితకాలం శుభం జరుగుతుందన్నారు. స్వామివారి కైంకర్యానికి శుచి, శుభ్రత, ధార్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. భక్తి మార్గం ద్వారా లోక కళ్యాణం సిద్ధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచానికి సూత్రధారుకుడు లోకనాయకుడు గోవిందుడు అందరిని ఈ సందర్భంగా స్వామీజీ ప్రవచనం అందజేశారు. స్వామి వారి దర్శనం ఒక గొప్ప యోగం అన్నారు. యోగం ద్వారానే ప్రపంచ దేశాలలో ఎంతో మంది భక్తులను కాపాడుతున్న తాను స్వామివారి ఆజ్ఞతో యోగం ద్వారా గోవిందుడు దర్శనం చేసుకుని పులకరించానని తెలిపారు. స్వామీజీ జన్మ అసాధారణమైనదని కలియుగ ప్రజలను కాపాడేందుకు దత్తాంశలో జన్మించిన గురువని శత సహస్రావధానులు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు స్వామీజీ జన్మ రహస్యాన్ని వెల్లడించారు.

## జిమ్‌ల ఏర్పాటుకు కృషి : కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ, మే 23 ప్రభాతవార్త : డివిజన్ పరిధిలో అవసరమైన చోట జిమ్‌లను ఏర్పాటు చేస్తామని మీర్‌పేట్ ఎస్‌బిఐ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్బి కాలనీ డివిజన్ ఫేస్ టు కమ్యూనిటీ హాల్ ఆవరణలో నూతనంగా మంజూరైన ఓపెన్‌జిమ్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రమోహన్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.